

# ఇగ వీడు తొవ్వకు రాడు

పెద్దింటి అశోక్‌కుమార్

'ఉరికిన శాలోడు అదే అంగడి, ఉరకని శాలోడు గదే అంగడి,' అన్న శాత్రం ఇప్పుడుగాదు నేను చిన్నగున్నప్పుడే విన్న. మా అమ్మ ఎన్నోసార్లంటుండె. ఎందుకోగాని ఈ శాత్రం ఎన్నో రోజులు నా మనసుల మెదిలేది. ఇద్దరు ఒక్కటెట్లయితరని మా అమ్మనే అడిగిన.

'నీకెందుకురా ముసలక్క ముచ్చట్లు,' అని యాస్టపడ్డది. అప్పటికది మరిచిపోయినా అప్పుడప్పుడు ఎవలో ఒకల నోట వింటనే ఉన్న. మూడు నెల్లకింద బాలకిషన్ ఇంటికి వచ్చినప్పుడు ఇదే శాత్రం చెప్పిండు. ఆరోజు పొద్దుగల్లనే ఇంటికచ్చిండు. మాట్లాడద్దనే అనుకున్న. వాళ్ల నాయన ఎంకట్రాములు యాదికచ్చిండు. పోరడు ఎంత చెప్పినా ఇనకనే పాయె. చెప్పితే ఇననోన్ని చెడంగ సూడాలె అనుకున్న. ఇల్లు సొచ్చుకొని వచ్చినప్పుడు మాట్లాడకపోవుడు మర్యాద గాదనుకున్న.

"ఏంరా పటేలా ఎటో వచ్చినవు... అంత మంచిగనేనా," అడిగిన.

బాలకిషన్ నవ్విండు. నవ్వుకుంట, "ఆ... ఏంది సారూ... పటేలా అనవడితివి. పటేలు గిట్లనే ఉంటడా... పేరు పెద్దిర్కం ఇల్లు జలజంత్రం," అన్నడు.

"ఎవుసం జేత్తున్నవు గదా... ఎవుసం. అందుకే అన్న," నవ్వుకుంట చెప్పిన.

బాలకిషన్ నవ్వలేదు. "ఎవుసం జెయ్యక అందరచ్చి సిటీలల్ల కూసుంటె తిండి ఎక్కడి నుంచి వస్తది సారు. పైసలు తింటమా... ఎవలో ఒకలు ఆ పని చెయ్యాలెగదా..." అన్నడు.

కొంచెపోని కొంగువడితే మంచోని మానం పోయిందట. వీనితోని శాంతానమెందుకు అనుకుని, "సరేగనీ... ఏమో వచ్చినవు," అడిగిన.

"నీతోనే కొద్దిగ పనుండి వచ్చిన," అన్నడు.

నాకు ఏదో అనుమానమచ్చింది. 'బుద్ధికచ్చినట్టున్నడు. ఏమన్న పని జూడుమంటడేమో...' అనుకుని, "నాతోని... ఏం పనిరా," చాయి ఇస్తు అడిగిన.

"మా బాపుఉండంగ ప్యాట్లనే తెస్తుండె. నేను అక్కడనే తెస్తున్న. చేను నాటుకచ్చింది. దుక్కిమందు లేదంటున్నరు. ఇక్కడ నాకు కొత్త గదా. ఉద్దెర ఎవలు నమ్ముతరు. మీ పేరు జెప్పిన. తోలుకరా పో అన్నరు," అన్నడు.

"అంతేనా... సరే... ఉండు, తానంజేసి వత్తా," అన్న. అంతట్లనే అనుమాన మచ్చింది. "ఇంత పొద్దుగల్ల దుకాణాలు ఎవలు తీసింద్రు," అన్న.

బాలకిషన్ నవ్వుకుంట, "ఏమో... పోతేగదా తెలిసేది. ఇదే మాటంటరని ఇటే వచ్చిన," అన్నడు.

నాగ్గూడా నవ్వచ్చింది. "అబ్బో... దండోనివే... ఏమో అనుకున్న, కడుపుల పేగులు లెక్కవెట్టే తట్టున్నవు గదా... ఇంతమాత్రం ఇకమాతు (ఉపాయం) రాజమల్లుకున్నా బాగుపడుతుండె. ఇప్పుడు తుకం బోత్తండట. నిన్న ఇత్తునపువడ్ల కచ్చిండు. శివరాత్రి వత్తంది... ఇప్పుడు తుకం (నారు) బోత్తే ఎన్నడు నాటు వెడుతడు... ఎన్నడు కోత వడుతడు," అన్న.

చాయి తాగుకుంట, "కోత పడితే ఏం లాభం సారూ... కొనేటోడుండద్దు. వాడు మార్కెట్ ఓపెన్ చేసి తక్కడ బాట్లు సదురుకుని కొనుడు మొదలుపెట్టేసరికి గదే అయిటి (తొలకరి) మూనుతది," అంటూ ఈ శాత్రం జెప్పిండు.

అది నాకిప్పుడు గుర్తుకు రాకపోతుండె. ర్యాలీల బాలకిషన్‌ను చూడంగనే గుర్తు కచ్చింది. అది ఎర్రటి ఎండ. రైతుల కండ్లు అంతకంటే ఎర్రగా ఉన్నయి. ఒకలకు కాళ్లకు చెప్పులే లెవ్వు. ఒకలకు నెత్తి మీద తువ్వాల గూడా లేదు. అవి చెమటలో కన్నీళ్లో గని కారుతనే ఉన్నయి... నినాదాలు అరుపులు.

కరంటుకోతను- నివారించాలి.

చాలినంత కరంటు- ఇవ్వాలి.

ఎండిన పొలాలకు- నష్టపరిహారమివ్వాలి.

ప్లకార్డులు పట్టుకుని ముందుకు కదులు తున్నారు. శత్రువెవరో ముందే వున్నట్లు... అతని ఉనికిని గుర్తించినట్టు... అతని మీద దాడికి వెళ్తున్నట్లు... సైనికుల కవాతుగా ర్యాలీ. బాలకిషన్ ముందే ఉన్నడు. రైతులను ముందుకు నడుపుతున్నడు. ఎస్టీవోలో ఓ ఎరియర్స్ బిల్లు ఉంటే ఇచ్చిరాంగ ఎదురైంది ర్యాలీ.

ముందు నేను బాలకిషన్‌ను చూడలె. ర్యాలీ దాటి సందులకు తిరిగిన. ఎందుకో వెనక్కు తిరిగి చూసిన. అప్పుడు కనిపించిండు బాలకిషన్. బ్రేకు మీద కాలుపడ్డది. కర్రుమని స్కూటర్ పగ్గం పెట్టుదూరంలో ఆగిపోయింది. నేను విచిత్రంగా చూసిన.

బాలకిషన్ రైతులకు ఏదో బోధపోస్తండు. ర్యాలీని ముందుకు నడుపుతుండు. తప్పదన్నట్లు... తప్పకుండా చేయాలన్నట్టు రైతులు ముందుకు నడుస్తు న్నరు. భుజాన తుపాకులేసుకున్న ఇద్దరు పోలీసులు ముందొకరు వెనుకొకరు అర్థంగాని పనేదో చూసుకుంట చేసుకుంటున్నట్లు తొవ్వ నడుస్తుండ్రు.

నాకు చిత్రమనిపించింది. ఏ లెక్కన చూసినా బాలకిషన్‌కు ఇప్పుడు కరెంటుతో పనిలేదు. ఎప్పుడో కోతవట్టి రాశి చేసి ఉంటడు. మిగతా రైతులకు కరంటు అవసరం ఉండచ్చు. మరి ర్యాలీల బాలకిషన్ ఎందు కున్నట్టు....?

బాలకిషన్ నన్ను చూసి నవ్విండు. నేను నవ్విన. అడుగుదామనుకున్న. దూరంలో ఉన్నడు. ర్యాలీ సాగి పోతుంది. అతడు వెళ్లిపోతుండు.

ఆగమాగాన ఇంటికచ్చిన. అవునా కాదా అన్న అనుమానం వచ్చి ఒకసారి మంజులను అడిగిన. బాల కిషన్ పేరు జెప్పి శాత్రం చెప్పంగనే డేటుతో సహా చెప్పి మూడు నెలలు దాటిందని చెప్పింది. ఆ లెక్కనైతే బాల కిషన్ కల్లం పొల్లు లెవ్వాలె. ఇంకా అనుమానపడు తుంటే ఇంకో విషయం గూడ చెప్పింది మంజుల. వారం కిందనే మార్కెట్‌ల కలిసిండట బాలకిషన్. 'అక్కా కోత అయింది. రేపే కొత్తకు వడ్లు పంపిస్త,' అన్న డంట. అది నిజమే అనుకుని తొక్కులు నూరి ఇస్తార్లు కుట్టి పెట్టింది. ఇస్తారు ఇటు కొత్త అటు. వడ్లు లెవ్వు. మనిషి లేడు.

కూలర్ కటుక (స్విచ్) వేసి టీవీ పెట్టిన. కేబుల్ టీవీలో పగటి వార్తలు. కరంటు ఆఫీసు ముందు ధర్నా. బాలకిషన్ ముందే ఉన్నడు. నినాదాలిస్తున్నడు. ఛైర్మన్‌ను నిలదీస్తున్నడు. కారుకు అడ్డం పండుకున్నడు.

*

మనిషికి మనిషి దొరుకని కాలం. పనున్న దినం. వరికోత అయిపోయినా బాలకిషన్ ఎందుకు ధర్నాకు దిగినట్లు...? ఇదే ప్రశ్న పుర్రెల సుడి దిరుగుతుంది. బాలకిషన్ తండ్రి వెంకట్రాములు నాకు బాగా తెలుసు. ఆ సోపతి ఇప్పుడు గాదు. పదేండ్లది. నేను మల్లారెడ్డి పేటలో ఉంటూ బండలింగంపల్లి బడిలో పనిచేస్తు న్నప్పటిది. నేను బడికి పోవాలంటే గోపాల్‌పల్లె దాటాలె. ఎంకట్రాములుది గోపాల్‌పల్లెనే. మా ఇద్దరి పరిచయం విచిత్రంగా జరిగింది.

ఒకరోజు రోడు మీద గోధుమకంకులు ఎండ వెట్టిండు ఎంకట్రాములు. పక్క పొంట జానెడు జాగ ఇడిసిపెట్టలేదు. జరంతలైతే నా బండి జారి పడుతుండె. ఆపి కోపంగా అడిగిన. "రోడు నిండ పోసినవు. జెరంత తొవ్వ ఇడిసిపెడితే తప్పయిందా... జారితే ఎట్లుండు," అని.

ఎంకట్రాములు పక్కనే ఉన్నడు. కోపంగా నా దిక్కు చూసిండు. "ఏం గాకపోతుండె. మహా అయితే కాలో చెయ్యో ఇరుగుతుండె. వారానికో నెలకో అతు క్కుంటుండె. పంట తడిసి మా బతుకులే జారిపోయి నయి గదా... ఏండ్లయినా అతుకయి," అన్నడు.

ఆ మాటలు అతడు కోపంగా అన్నా నాకు మాత్రం కోపం రాలేదు. ఎందుకో బాధ అనిపించింది. మనిషిని చూసిన. బక్క పలుచగా ఉన్నడు. మొఖంలో బాధను దాచుకున్నడు. వట్టిగవోతే అలుసైతనని మనిషిని ఇరుగ జూసిన. ఎంకట్రాములు కూడా నన్ను ఇరుగ జూసిండు. "అట్ల గాకుంటె నువ్వెక్కడాగుదువు," అనుకుంట గేరు మార్చిన.

ఇది జరిగినంక వారం పదిరోజుల కనుకుంట, 8వ తరగతిలో బాలకిషన్ అనే పిల్లగాడు వరుసగా వారంరోజుల నుండి బడికి రాలేదని క్లాస్ టీచర్ చెప్పిండు. వానిది గోపాల్‌పల్లె అని తెలుసుగని ఇల్లు తెలువది. ఏమైందని ఇంటికివోతె ఇంట్ల ఎంకట్రాము లున్నడు. కడుపునిండా మాట్లాడిండు.

మరునాడు పొలం దగ్గర కనిపిస్తే బండి ఆపి ఎక్కించుకుని ఊర్లె దించిన. ఇంకోనాడు అదే టయానికి అక్కడ తయారున్నడు. ఎంకట్రాములు పొలం దగ్గర దగ్గర లింగంపెల్లి పొలిమర్ల ఉంది. ఏం లేదన్నా రెండు కిలోమీటర్లు.

అప్పుడు బిలో ఇన్‌ఛార్జ్ నాదే. పొద్దుమాపు స్టడీ అవర్. పొద్దున ఎనిమిదీటికి పోతే పొద్దుగూకి ఏడు దాటుతుండె. నా టయము సరిగ్గా ఎంకట్రాములు టయానికి కుదిరింది. నాట్లు కోతల మీద్దైతే వాడిక పెట్టుకున్నట్టే.

ఓనాడు నాలుగు ముక్కకంకులు డిక్కీలో వేస్తుండె. ఓనాడు నాలుగు దోసకాయలు సంచిలో వేస్తుండె. ఓనాడు కాల్చిన చిప్పలకాయలు, ఇంకోనాడు ఓనగాయ. బండి ఎక్కింది మొదలు దిగేదాక ఏదో ఒక ముచ్చట వెడుతుండె. తన భూమి గురించి చెబుతుండె. పంట గురించి చెబుతుండె. తన కష్టసుఖాలు చెబుతుండె.

నేను పరాచికానికన్నట్లు, 'పటేలా' అంటుంటిని. అతడు నవ్వుతుండె. రాను రాను అదే అతని పేర యింది. ఎర్రగొట్టెలు, పొలాకులు, బందార్లు మొదలు అయ్యార్ ఫిఫ్టీ, బీపీటీ దాకా వడ్ల రకాల గురించి చెప్పిండు. పునాస, నీరావ పంటల గురించి చెప్పిండు. భూముల మర్మం గురించి చెప్పిండు.

ఒకనాడు బడి లేదు. అతనికొరకే వెళ్లిన. ఉండబట్టలేక అదే సంగతి చెప్పిన. అతడు నవ్వుకుంట, "నేను వారం నుంచి ఇదే పని చేస్తున్న. పొలంల నాకు పనేలేదు," అన్నడు.

ఎంకట్రాములుది మూడెకరాల వందురు (తడి) పొలం. మోకాళ్లమంటి దిగువాటు. వాళ్ల తాత పారతోనే తవ్వుతుండెనట. వెంకట్రాములు తండ్రి తట్టతోని ఉసికె మోసి పొలమంతా పరచి పోసిండట. అప్పుడు దిగువాటు పోయి ఎడ్ల నాగలి కట్టచ్చిందట.

అన్నీ చిన్నచిన్న మడ్లు. ఎంకట్రాములు చిన్న మడ్లను పెద్ద మడ్లు చేసిండట. అప్పుడుగాని ట్రాక్టరుకు తిరుగ వీలుకాలేదట. ఇవన్ని సంగతులు ఎంకట్రాములే చెప్పిండు.

మేము రోడ్డు పొంట పోతుంటే ఉపాధి హామీ పనికి పోయేటోళ్లు గుంపులు గుంపులుగా ఎదురైతరు. ఎందుకోగని వాళ్లను చూస్తె మండుతుండె ఎంకట్రాములు.

"ఊ... చూసినవా సారూ... డూటీలకు వోతండ్రు. నెత్తిమీదికి పొద్దురానే రాదు ఇంట్లచ్చి పడుతరు. చెముట గారకుంట రోజు వంద," ఒకనాడు వాళ్లను చూసి రోజూ అన్నట్టే అన్నడు.

నాకు యాష్టకచ్చింది.

"అ... వాళ్లిచ్చిన వందతోని వీళ్లు మిద్దెలు గడుతరా మేడలు గడుతరా... కైకిలోళ్లు బతుకద్దా ఏంది...? చేసుకుందామంటే పనే లేకపాయె. వాడెట్ల బతుకాలె," అన్న. అప్పుడు సప్పుడు జెయ్యలే. కొద్ది దూరం పోయినంక ఏదో కొంపలు అంటుకున్నట్లు, "ఆగు సారూ... ఆగాగు," అన్నడు.

నేను బండిని ఆపిన. ఎంకట్రాములు కిందికి దిగిండు. అక్కడ నాటుకచ్చిన పొలముంది. దాన్ని చూపిస్తూ, "నువ్వన్నది సరే. ఇది జూడు. దీన్ని ఎవ్వడు నాటెయ్యాలె. కైకిలోళ్లు దొరుకక ఇట్లనే ఉంది. కోతంటే మిషినితోని ఇట్లనో అట్లనో కోత్తం గని నాటెట్ల. నేననేది అదే... ఇదే పండిందనుకో అందరు బతుకుతరు. గానూర్రూపాయలిత్తె బతుకుతరా... మట్టకు బెల్లం రాసి నాకుమంటె కడుపు నిండేదా మండేదా... ఎన్ని రోజులిత్తవు... ఎందరికిత్తవు... బతుకుదెరువు జూపియ్యి. ఎవల కాళ్ల మీద వాళ్లే నిలవడుతరు..." అంటూ బండెక్కి, "ఇన్ని నీళ్లో కరంటో ఇత్తె జాలు... ఎవడూ పని అడుగడు," అన్నడు.

ఎంకట్రాములు ఆలోచనలు అట్లుండె. ఒక్కొక్కసారి నాతో వాదం బెట్టుకున్నట్టే మాట్లాడుతుండె. మంకురు మంకురు జేత్తుండె. ఇంట్ల మా అన్నగంతే. ఒక్కొక్కసారి ఎంకట్రాములు లెక్కనే జేత్తుండె. మాటలల్ల ఇద్దరిని తియ్యరాదు, పెట్టరాదు అన్నట్టుందురు.

ఒకసారి బాయి ఎండింది. బోరు ఏత్తనన్నడు. ఎన్నడు లేనిది కండ్లకు నీళ్లు దీసుకున్నడు. అప్పు అడిగిండు. లెవ్వన్న మాట నోట్లెదాక వచ్చి ఆగింది. భయపడుకుంటనే ఇచ్చిన. ఇచ్చినంక అనుకున్న ఇవి నీళ్లల ఏసినట్టే అని.

పంట మీద మొదలు నాకే ఇచ్చిండు. లోపల లోపల, 'అబ్బ వచ్చినయిరా,' అనుకున్న. బయటకు మాత్రం మాట వరుసకన్నట్టు, "అయ్యో పారిపోదువా... జెట్టన్నె ఇచ్చినవు," అన్న లెక్క వెట్టుకుంట.

"పతార ఉండాలె సారూ... పతార... మా బతుకులు బజార్ల దీపాలు. ఎప్పుడే గాలి వత్తదో తెలువది. అడ్డం బట్టుడుకు మీలాంటి రెండు చేతులుండాలె..." అన్నడు నవ్వుకుంట.

నవ్వుడు, నిబ్బరంగా ఉండుడు అతనికి పుట్టుకతోనే వచ్చినయనుకుంట. ఏసిన బోరు ఎండిననాడు, కరంటు షాకిచ్చి నీళ్లు దాగుతున్న ఎద్దు సచ్చిన్నాడు,

రాళ్లవాన గొట్టి వరిగలుకలు జాడిచ్చిన్నాడు అతని మొఖంల నేను అదే నిబ్బరం చూసిన.

ఈ పదేండ్ల సోపతిల చాలా రోజులదాక మా ఇద్దరి సోపతి అవసరాలు తీర్చుకునేదిగానే నేను చూసిన. లాంగ్ స్టాండింగ్ కింద నాకు సిరిసిల్లకు తబాదల (బదిలీ) అయిన్నాడు సమానంతా ట్రాక్టర్ల దెచ్చి ఇల్లు నింపిపోయిండు. చవితినాడు ఫోన్ జేత్తె ల్యాతకంకులు, బబ్బెరికాయలు, ఆకుపత్రి ఇచ్చి పోయిండు.

బిడ్డ పెండ్లి జేత్తున్ననని నాకు ఫోన్ జేత్తె జీబు కిరాయి మాట్లాడిచ్చిన. బట్టలు సామాన్లు తెలిసిన దుకాణంల ఇప్పిచ్చిన. ఎంకట్రాములు మా ఇంటి కత్తే నాకెంతో మురువతు. ఏదో పని అరుసుకుంటడని. నేను ఎంకట్రాములు ఇంటికిపోతే వాళ్ల కెంతో ధైర్యం, సారున్నడని.

సిరిసిల్ల కచ్చినంక ఆ తొవ్వ ఎరుగు దప్పినట్ట యింది. ఫోన్‌ల మాట్లాడుకుంటుంటిమి. ఎంక ట్రాములు మిస్‌కాల్ ఇస్తుండె. నేను ఫోన్ జేత్తుంటిని. అంతకు ముందు పొలం గురించి, పంట గురించి, బాధల గురించి చెబుతుండె. ఈసారి కొడుకు గురించే ఎక్కువ చెప్పుడు మొదలువెట్టిండు. వాడు డిగ్రీల ఫేలయిండట.

"వాడేదో తొవ్వల పడితే నా బరువు వోతుండె సారు... సదువుకుంట లేడు. తిరుగుడు నేర్చిండు. నా బతుకు ఎట్లనో గడుత్తుంది. కనీసం వీడన్న ఏదో తొవ్వలపడితే బాగుండుగదా...?" అంటుండె.

మేము కలుసుకునుడు తక్కువయింది. ఎప్ప డన్నా ఇంటికి వోయినప్పుడు కలిసి పోతుంటిని. ఎంక ట్రాములు ఏదన్నా పనిమీద సిరిసిల్లకు వచ్చినప్పుడు కలిసి పోతుండె. ఆమధ్య అల్లునికేదో ఆక్సిడెంటయిం దట. కొడుకుని దుబాయి పంపిత్తనని పైరోవెట్టి (పైరవీ చేసి) లక్ష మునిగిండట. నీళ్లు లేక పొలం ఎకురం గూడా పారుత లేదట. కో ఆపరేట్ బ్యాంకోళ్లు అప్పు కోసం సక్తు జేత్తండ్రట.

ఒకసారి కాలిపోయిన మోటర్‌ను మెకానిక్ దగ్గరికి తెచ్చినప్పుడు ఈ కథంతా చెప్పిండు. మనిషిలో ముందటి తెగారం (తెగువ) లేదు. నవ్వులేదు. ఈడ్చుక పోయిండు. కొడుక్కు ఏదన్నా కొలువు చూడమన్నడు. ఏదో మీటింగు ఉండి నా ఆగంల నేనున్న. కనీసం ఇంటికి రమ్మని కూడా పిలువలేదు. ఇంకోసారి ఫోన్ చేసినప్పుడు ఇదే ముచ్చట చెప్పి కొడుకుకు ఏదన్న తొవ్వ చూపియ్యమన్నడు.

వాన్ని తోలుక రమ్మని డాక్టర్ చేతి కింద ఉంచిన. నాలుగురోజులుండలేదు. మెకానిక్ చేతి కింద ఉంచిన. ఓనర్ మీదికే మర్రవడ్డడట. ఎస్టీడీ బూత్‌ల ఉంచిన. అందరికి మిస్‌కాల్లు ఇచ్చుడు పెట్టిండట. కొరియర్ ఆఫీసుల ఉంచిన. ఎక్కడ పొగువొయ్య (కుదురు) లేదు. ఎంకట్రాములు మల్లా నా దగ్గరికి రాలేదు. బాల కిషన్‌ను తోలలేదు.

ఆరోజు నేను బడిలో ఉన్న. లీజర్ పీరియడ్‌లో పిల్లల ఫేర్ కాపీలు దిద్దుతున్న. సెల్‌ఫోన్ రింగయింది. చూస్తే ఎంకట్రాములు. కట్ చేసి నేనే చేద్దామనుకుంటే మళ్లీ మోగింది. ఎత్తిన.

ఎంకట్రాములు గొంతు ఎట్లో ఉన్నది. నోటి నిండా బుక్క వెట్టుకుని మాట్లాడుతున్నట్టు. "సారూ... నా కొడుకు పైలం. అప్పుడప్పుడు తొంగి చూసి పొండ్రి. అప్పోసప్పో ఆదుకోండ్రి. వాన్ని మీ చేతుల వెడుతున్న. ఏదన్నా తొవ్వకు తేండ్రి," అని ఏడుత్తుండు.

ఏంది ఏమైందని అడిగినా చెప్పలేదు. అదే మాట. అదే ఏడుపు. ఫోన్ కట్టయింది. మళ్లీ జేత్తే స్విచ్చాఫ్. నా పెయ్యి మొత్తం జలజల పుట్టింది. గుండె దడదడమంది. సూడు సూడుమంట ఆరోజే ఆన్వెల్ ఇనుస్పెక్షన్. మేం మాడల్ లెస్సన్ తయారుచేసి పాఠం జెప్పతుంటె పక్కబడి సార్లచ్చి అబ్జర్వేషన్ చేస్తరు. సాయంత్రం డిప్యూటీ డిఇవో వచ్చి చూస్తడు. లీవు వెట్టుడుగాదు. అద్దగంట అటీటుపోవుడు వీలుండది. చేతుల మూడు లెస్సన్ ప్లానులున్నయి.

ఏది ఏమన్నగానని పెద్ద సారు ఒప్పుకోకున్నా కాయిదం రాసి పెట్టి బయటపడ్డ. పొలం దగ్గరనే మంది గుంపుగా కనవడ్డరు. పోయి చూసినంక నేను మనిషినే కాలె. పొట్ట కచ్చిన చేనంతా ఎండిపోయి ఉంది. ఎండిన మడిలో ఎంకట్రాములు శవం. కొట్టుకొని కొట్టుకొని కండ్లు మూసినట్టున్నడు. వరి మొత్తం ఎండి ఇరిగిపో యింది. తలాపున ఓ దిక్కు సెల్‌ఫోన్. ఓ దిక్కు మందు డబ్బ. దుఃఖం ఆగలేదు. నేను మీద పడి ఏడ్సిన.

తెల్లారి పేపర్ నిండా వార్తలు. కరంటు కోతతోనే పొలం ఎండిపోయిందని పేపర్లు. కాదు... భూమిల నీళ్లు లేకే అని అధికారులు.

ఎంకట్రాములును మరిచిపోవడానికి నాకు చాలారోజులు పట్టింది. అప్పుడప్పుడు ఇంటికి పోయి వస్తున్న. పోతూపోతూ ఎంకట్రాములు చెప్పిన మాటలే నా చెవులల్ల మోగుతున్నయి. బాలకిషన్‌ను తోలుకచ్చి రెండు మూడు జాగల్ల పనిల పెట్టిన. ఎక్కడ వారం నెగులలేదు.

“ఆహా... ఏం పొల్లగాన్ని దెచ్చినవు సారూ... కందిరీగ. వీడు చేతుల కిందుంటే సాలు, నూనెవోసి అలుక్కున్నట్టె,” అన్నరు.

నా మనసు ఇరిగింది. ‘అయ్యోడుగాదు అవ్వోడు గాదు జంగమోన్ని పట్టుకుని జామేడ్సినట్టు ఈ పోరని తోని నాకేంది,’ అనుకున్న. నేను పట్టిచ్చుకోలేదు. ఈ పోరడు తొవ్వకు రాడు అనుకున్న. వాళ్లమ్మ ఫోన్ చేసి ఏడుస్తుండె. నేను నచ్చజెప్పాలని చూస్తుంటిని. కాని వాడు చెడ మిర్ర మాట్లాడుతుండె. ‘తీట వంగని కొడుకు. వాడే ఎన్నడో వత్తడు,’ అనుకున్న.

బాలకిషన్ రాలే. వాళ్లమ్మా ఫోన్ జెయ్యలే. ఒక నాడు ఏదో పనిమీద ఊరికి పోతుంటే మాత్రం పొలంల కనవడ్డడు. దున్నుతున్నడు. నాకు చిత్రమనిపించింది. ఎంకట్రాములు గుర్తుకచ్చి బాధనిపించింది. బాలకిషన్ మీద కోపమచ్చింది.

బండి ఆపి పొలంలకు పోయిన. బాలకిషన్ నాగలి ఆపి నా దగ్గరికచ్చిండు. “దున్ని దున్ని మీ నాయన సచ్చిండు. ఇప్పుడు దున్ని నువ్వేం సంపా యించుకుంటననుకున్నవు. ఈ భూమిని జూత్తే నీకు విరక్తి పుడతలేదా,” అన్న.

అంతా తండ్రి లెక్కనే. అదే తిక్క, అదే మాట. “భూమేం జేసింది సారూ... పాడి బర్రె. మా తాతలు ఎట్ల బతికింద్రు... ముత్తాతలు ఎట్ల బతికింద్రు. మా నాయినే ఎందుకు సచ్చిండు. భూమి మీద విరక్తి ఎందుకు సారూ... భూమిని ఈ స్థాయికి తెచ్చినోళ్ల మీద తిక్క పుడుతంది,” అన్నడు.

“ఇగ నువ్వు తొవ్వకు రావు. ఒగలు చెప్పితే వినవు. నీది నీకు తెలువది. నీకు చెప్పుడు నాదే బుద్ధి తక్కువ,” అన్న. అన్నగని మనసు ఊకోలే. నాలుగైదు సార్లు ఇంటికి పోయిన. ఎవుసం వద్దని నచ్చజెప్పిన. వాళ్లమ్మ గూడా వాన్ని పొమ్మని బతిమిలాడింది. బాల కిషన్ రాలే. ఇగ నేను గూడా పట్టిచ్చుకోలే.

*

అగో... అప్పుడు గనపడ్డ బాలకిషన్ మూడు నెలల కింద ఇంటికచ్చిండంటే ఇప్పుడు ర్యాలీల కన పడుడె.

నాకు ఒక రకంగా కోపమత్తుంది. ఒక రకంగా బాధ అనిపిస్తుంది. ‘పోరడు పాడుగాను. ఎట్లయిపాయె. ఎందుకు పనికిరాకుంటాయె. ఎర్రటి ఎండల కాళ్లు గాలంగ రోడ్లు పట్టుక తిరుగుతె అయ్యగానికి అయి మంటుంది,’ టీవీల చూసి అనుకున్న.

అనుకున్నగనీ పాణం దరించలేదు. ‘పిస్సపోరడు. వీడు తొవ్వకు రాడు,’ అనుకుంట ఎండ సల్లవడ్డంక బాలకిషన్‌ను దేవులాడుకుంట కరంటు ఆఫీసుకు పోయిన. ఇప్పుడు ధర్నా ఆర్డీవో ఆఫీసు ముందుకు మారింది.

కొనుగోలు కేంద్రాలు చాలు జెయ్యాలని ధర్నా జేత్తంద్రు. బాలకిషన్ ఆర్డీవోను నిలవెట్టి అడుగు తుండు. ఆర్డీవో నీళ్లు మింగుతుంద్రు. అయిపోయినంక పక్కకు పిలిచిన. నేను చెప్పవోతుంటే నాకే చెప్పిండు.

“ఏ వ్యవస్థకు మెడలు దించి మా నాయిన సచ్చిండో ఆ వ్యవస్థ మెడలు వంచి నేను బతుకుత. మీకు చెప్పాలనిపిస్తే ఆ తొవ్వల నాలుగు మాటలు చెప్పంద్రి,” అన్నడు. బాలకిషన్ చూపు మారింది. మాట మారింది.

నెలరోజుల తరువాత రైతులు విత్తనాల కోసం గోడౌను మీద దాడి చేసింద్రట. పేపర్ల వార్త చూసిన. బాలకిషన్ ముందటనే ఉన్నడు. నాకు దస్సుమంది. ‘థూ... నీయవ్వ... వీడా... వీడిగ తొవ్వకే రాడు,’ అను కున్న.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 27 సెప్టెంబర్ 2009*

